

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సతీష్

# ఆధార్‌తో పొంచి ఉన్న ప్రమాదం!

సోమాజిగూడ: ఆధార్ కార్డుతో అందరికీ మంచి జరుగుతుందనుకోవడం సరికాదని డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ డైరెక్టర్ పి.వి.సతీష్, నేషనల్ అలయన్స్ ఆఫ్ పీపుల్స్ మూమెంట్స్ రాష్ట్ర జాయింట్ కన్వీనర్ కె.సరస్వతి హ్యూమన్ రైట్స్ లా నెట్‌వర్క్ కో-ఆర్డినేటర్ ఎం.ఎ.షకీల్ పేర్కొన్నారు. ఆధార్ ప్రాథమికంగా వ్యక్తుల కళ్లు, వేలిముద్రల ఆధారంగా రూపొందుతోందని, రాజ్యాంగం ప్రసాదించిన వ్యక్తిగత గౌరవం, గోప్యతలకు ఇది భంగకరమని శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వివరించారు. నేరస్తులు, టెర్రరిస్టులకోసం ఉపయోగించే పద్ధతిని సామాన్య ప్రజలపై ప్రయోగిస్తున్నారని ఆరోపించారు. వేలిముద్రల్ని నకలు (డూప్లికేట్) చేసే అవకాశాలు ఉన్నాయని, దీంతో అమాయకులపై నేరముద్ర పడే ప్రమాదం పొంచి ఉందన్నారు. రాబోయే రోజుల్లో యూఐడీ నంబర్‌తో మనలో చిప్ అమరిస్తే ఆ వ్యక్తి కదలికలు, ఎక్కడ, ఏం చేస్తున్నాడన్న విషయం తెలుస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. వేలి ముద్రలు మారిన వ్యక్తికి సదుపాయాలు అందడంలో జాప్యం జరగవచ్చన్నారు. ఈ విషయాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తామన్నారు.